## మునుగోడుకు సాగు జలాలు తీసుకొస్తా

● ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 28 : శివన్నగూడెం ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేసి రాచకొండ, దేవులమ్మ నాగారంలో రిజర్వాయర్లు ఏర్పాటు చేసి ప్రతి ఎకరాకు సాగు జలాలు అందించి మునుగోడు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో ఆదివారం నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల కష్టాలు దూరం చేయడానికే భూ భారతి చట్టం తీసుకొచ్చామన్నారు. తాసీల్దార్ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతుందని, పని కోసం వచ్చిన రైతులు, ప్రజలను డబ్బుల కోసం పీక్కు తింటున్నారన్న విషయం తన దృష్టి వచ్చిందని తెలిపారు. అధికారులు పద్ధతి మార్చుకోవాలని సూచించారు. కబ్జాకు గురవుతున్న రాచకొండ ప్రాంతంలోని భూములను కాపాడాలని ఎమ్మెల్సీ సత్యం కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి : ఆర్డీఓ కృష్ణారెడ్డి



మోటకొండూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

యాదగిరిగుట్ట/ మోటకొండూర్, ఏప్రిల్ 28 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, రోజుకు మూడు లారీల చొప్పున మిల్లులకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామంలో, మోటకొండూరు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## కొనుగోళ్లను వేగవంతం చేయాలి : డీఏఓ



కొలనుపాకలో ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

ఆలేరు రూరల్, ఏప్రిల్ 28 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. మండలంలోని కొలనుపాకలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పరిశీలించి మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఏఓ శ్రీనివాస్, ఏఈఓ శివకుమార్, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి మధు ఉన్నారు.

### కొల్లూరులో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

మండలంలోని కొల్లూరు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పీఏసీఎస్ చైర్మన్ మొగులగాని మల్లేశ్‌గౌడ్ రైతులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల వద్ద మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలి : డీసీఓ



హమాలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డీసీఓ మురళి రమణ

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 28 : రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన వెంటనే నాణ్యతను పరిశీలించి తూకం వేయాలని కేంద్రాల నిర్వహకులకు జిల్లా సహకార అధికారి (డీసీఓ) మురళి రమణ సూచించారు. పట్టణంలోని హుస్సేనాబాద్ కాలనీ సమీపంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. హమాలీ కార్మికులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యత గల ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



చౌటుప్పల్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్, ఏప్రిల్ 28 : పట్టణంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీఓ వి.శేఖర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. కొనుగోలు వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడారు. ఒక్కో రైస్ మిల్లుకు ఏడెనిమిది కొనుగోలు సెంటర్లు ఉండటంతో లారీల దిగుమతి రెండు రోజులు పడుతుందని పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి వివరించారు. రైస్‌మిల్లుల యజమానులు హమాలీలను పెంచడంతోపాటు లారీ కాంట్రాక్టర్లు పెద్ద కేంద్రానికి మూడు, చిన్న సెంటర్‌కు రెండు లారీలు పంపేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్డీఓ అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్‌రావు, పీఏసీఎస్ సీఈఓ వై.రమేశ్, రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రంలో వసతులు కల్పించాలి : తాసీల్దార్



కూరెళ్ల కొనుగోలు కేంద్రంలో తేమ శాతం చూస్తున్న తాసీల్దార్ లావణ్య

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 28 : మండలంలోని పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 17 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టెంట్, మంచినీటితోపాటు ఇతర వసతులు కల్పించాలని తాసీల్దార్ లావణ్య అన్నారు. మండలంలోని కూరెళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేయాలని సూచించారు. ఆమె వెంట ఆర్ఐ మల్లికార్జున్‌రావు, పీఏసీఎస్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ భిక్షం పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చౌటుప్పల్, ఏప్రిల్ 28 : పట్టణంతోపాటు చిన్నకొండూర్, జిబ్లక్‌పల్లి, అంకిరెడ్డిగూడెం, తాళ్లసింగారం, లింగోజిగూడెం తదితర గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాజుల సతీశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ హైవే ఫ్లైఓవర్ పనుల్లో భాగంగా రోడ్డు వెంట ఉన్న 132 కేవీ లైన్ ఎత్తు పెంచుతున్నందున ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# భూ భారతి చట్టంతో రెవెన్యూ సమస్యలు పరిష్కారం

● కలెక్టర్ హనుమంతరావు



మోటకొండూరు : సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

మోటకొండూర్, ఏప్రిల్ 28 : భూ భారతి చట్టంతో భూములు, రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. భూ భారతి చట్టంపై మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ భారతిలో భూముల సమస్యను బట్టి తాసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో పరిష్కరించవచ్చన్నారు. భూ విస్తీర్ణంలో మార్పులు, మిస్సింగ్ సర్వే నెంబర్ల సవరణ వంటి సమస్యకు మీ సేవ కేంద్రాల ద్వారా కాకుండా స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఆధార్ మాదిరిగానే భూమికి భూధార్ అనే యూనిక్ నెంబర్ ప్రభుత్వం ఇవ్వనుందన్నారు. భూ వివరాలు రికార్డుల్లో తప్పుగా నమోదైనా, అసలు నమోదు కాకపోయినా భూ భారతి చట్టంతో సులభతరంగా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, తాసీల్దార్ నాగదివ్య, ఎంపీడీఓ ఇందిర, ఏఓ రమాదేవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మదార్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎగ్గిడి బాలయ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలి

భువనగిరి కలెక్టరేట్ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. మండలంలోని నందనం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మాయిశ్చర్ వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఆదివాసీలు, మావోయిస్టులను చంపడం అప్రజాస్వామికం

● ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జనార్దన్



నిరసన తెలుపుతున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

ఆలేరు టౌన్, ఏప్రిల్ 28 : అమాయకులైన ఆదివాసీలను, మావోయిస్టులను చంపడం అప్రజాస్వామికమని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్దన్ అన్నారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఆలేరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీలను, మావోయిస్టులను సజీవంగా పట్టుకొని కాల్చి చంపుతుందన్నారు. మధ్య భారతంలో మానవ హననానికి పాల్పడడాన్ని వెంటేనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ హయాంలోనే దేశంలో ఉగ్రవాదులు ఎక్కువ కావడంలో ఆంతర్యం ఏమిటో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. దేశంలోని అడవుల్లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టడం కోసమే మోదీ ప్రభుత్వం ఆదివాసీలు, మావోయిస్టుల మీద దాడులు చేసి కాల్చి చంపుతుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు సహదేవ్, ఆర్.సీత, అడివయ్య, రాజయ్య, కుమార్, శ్రీనివాస్, మంకయ్య, అంజయ్య, మురళి, గోపాల్, లత, సిద్ధులు, కృష్ణ, సంపత్, అంకయ్య పాల్గొన్నారు.

## వచ్చే నెల 2న ఆలయ భూముల కౌలుకు వేలం

మోత్కూరు, ఏప్రిల్ 28 : మండలంలోని ముశిపట్ల, పొడిచేడు గ్రామాల్లో ఉన్న దేవస్థాన వ్యవసాయ భూముల కౌలు కోసం వచ్చే నెల 2న వేలం నిర్వహించనున్నట్లు పొడిచేడు వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓ రామ్‌గోపాల్‌శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొడిచేడులోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం వ్యవసాయ భూములకు రెండు సంవత్సరాల కౌలుకు సంబంధించి స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉదయం 10గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పొడిచేడు కుర్దు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 131లో 8.31ఎకరాలు, పొడిచేడులో 260, 261 సర్వే నంబర్లలో 4.41 ఎకరాలు, 89, 90 సర్వే నంబర్లలో 4.35ఎకరాలు, పొడిచేడు కలాన్ 55వ సర్వే నంబర్‌లో 2 ఎకరాలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ముశిపట్ల గ్రామంలో 205 సర్వే నంబర్‌లో 13.35 ఎకరాల బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవస్థాన భూమి ఉందని పేర్కొన్నారు. ఆ భూమికి రెండు సంవత్సరాల కౌలు కోసం మే 2న మధ్యాహ్నం 2గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.5వేల టెండర్ డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

## నేడు ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 28 : అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా 2వ మహాసభలను యాదగిరిగుట్టలోని లక్కీ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభల్లో 10 అంశాలను డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు. పని హక్కు ప్రాథమిక హక్కుగా గుర్తించాలని, సమగ్ర యువజన విధానం, విద్యా అవకాశాల కోసం ప్రకృతి సంపద ప్రజలకే దక్కాలని సమర శంఖారావం పూరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లాఖాద్రీ, రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

## రామలింగేశ్వరస్వామి ఆలయానికి బెంచీలు అందజేత

మోత్కూరు, ఏప్రిల్ 28 : మున్సిపాలిటీలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన బందారపు శేఖర్ తన తల్లిదండ్రులు లింగయ్య – పిచ్చమ్మ జ్ఞాపకార్థం రూ.6వేల విలువైన సిమెంట్ బెంచీలను అందజేశారు. ఆలయానికి వచ్చే భక్తులు సేద తీరడం కోసం వాటిని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బయ్యాని రాజు, బుర్ర యాదయ్య, ఉయ్యాల అంజయ్య, బందెల రవి, బద్ది శెట్టి సతీశ్, కూరెళ్ల కుమార్, తొట్ల యాదగిరి పాల్గొన్నారు.

## మొరిపిరాలలో వైద్య శిబిరం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 28 : మండలంలోని మొరిపిరాల గ్రామంలో సోమవారం భువనగిరికి చెందిన ఆర్‌కే దవాఖాన, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 224మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు చావా రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

## మే 3న మడిగెల కిరాయికి బహిరంగ వేలం



బహిరంగ వేలం పత్రాన్ని విడుదల చేస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, డైరెక్టర్లు

మోత్కూరు, ఏప్రిల్ 28 : మోత్కూరు వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని కమర్షియల్ మడిగెల కిరాయికి మే 3న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి తెలిపారు. మార్కెట్ కార్యాలయం ఆవరణంలో సోమవారం బహిరంగ వేలం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 కమర్షియల్ మడిగెలను 2025–26 సంవత్సరానికి బహిరంగ వేలం వేయడం కోసం జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఎస్సీ–2, ఎస్టీ–1, బీసీ –3, జనరల్ కేటగిరిలకు –4 చొప్పున మడిగెలను కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మే 1న సాయంత్రం 5గంటల వరకు టెండర్ ఫారం కొనుగోలు చేసి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం మోత్కూరు పేరున రూ.10వేల డీడీ తీసి ఇవ్వాలన్నారు. 3న ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ పాలకవర్గ సభ్యులు పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ సమీర్, మార్కెట్ కార్యదర్శి ఉమామహేశ్, సూపర్‌వైజర్ శివ, సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో పక్షుల ఆకలి, దాహార్తిని తీర్చాలి




వాటర్ ఫర్ బర్డ్స్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న రాథోడ్

ఆలేరు టౌన్, ఏప్రిల్ 28 : ఎండా కాలంలో ప్రతి ఒక్కరూ గ్లాస్ వాటర్, గుప్పెడు గింజలు పెట్టి పక్షుల దాహార్తిని తీర్చాలని ఆలేరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న రాథోడ్ కోరారు. పట్టణంలోని సీహెచ్‌సీ ఆవరణలో జనని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వాటర్ ఫర్ బర్డ్స్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎండాకాలంలో మనుషుల దాహం తీర్చడానికి చలివేంద్రాలు ఉన్నాయన్నారు. కానీ.. నోరులేని ప్రాణుల దాహార్తిని తీర్చే వారు లేక విలవిల్లాడుతున్నాయని తెలిపారు. వాటి దప్పిక, ఆకలి తీర్చడానికి జనని స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రజలందరూ తమ బాల్కనీలో పక్షుల కోసం మంచినీళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రకృతిని కాపాడుదాం.. పక్షులను రక్షించుకుందామని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది కాటమయ్య, సంస్థ అధ్యక్షుడు ఆనంద్, కమలాకర్, జూకంటి సిద్ధులు, కృష్ణ, సంపత్, భాను, శ్రీకాంత్, రాజేశ్, సురేశ్, గణేశ్, చందు, హరీశ్ పాల్గొన్నారు.

## దివీస్ పరిశ్రమకు రాష్ట్రస్థాయి సేఫ్టీ బహుమతులు




బహుమతులు అందుకుంటున్న దివీస్ ఉద్యోగులు

చౌటుప్పల్, ఏప్రిల్ 28 : మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం దివీస్ పరిశ్రమకు రాష్ట్ర స్థాయిలో సేఫ్టీ బహుమతులు వచ్చాయి. వరల్డ్ డే ఫర్ సేఫ్టీ అండ్ హెల్త్ ఎట్ వర్క్–2025 పురస్కరించుకొని నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేఫ్టీ కాంపిటిషన్స్‌లో దివీస్ పరిశ్రమ ఉద్యోగులకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు దక్కాయి. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాజగోపాలరావు చేతుల మీదుగా పరిశ్రమ ఉద్యోగులు ఈ బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వై.మోహన్‌బాబు పాల్గొన్నారు.

## చేనేత సమస్యల పరిష్కారానికి కృషి : వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర చేనేత నాయకుడు వెంకటేశ్

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 28 : చేనేత సమస్యల పరిష్కారం కోసం నాయకులు, కార్మికులు సహకరించాలని రాష్ట్ర చేనేత నాయకుడు తడక వెంకటేశ్ కోరారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 1న ఉదయం 11 గంటలకు భూదాన్ పోచంపల్లిలో పద్మశాలి సభా వేదిక వద్ద చేనేత సమీక్ష సమావేశం జరగనున్నదని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. వారికి చేనేత సమస్యలను వివరించేందుకు చేనేత నాయకులు, అనుబంధ సంఘాలు, చేనేత వ్యాపార సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

## ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందజేత

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 28 : మున్సిపాలిటీ పరిధిలోని రేవణపల్లి గ్రామానికి చెందిన కొండ ప్రభాకర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. వాట్సాప్ గ్రూప్‌తోపాటు గ్రామానికి చెందిన మిత్రులు కలిసి సేకరించిన 3.10లక్షల రూపాయలను ప్రభాకర్ కుమార్తె, కుమారుడు పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ పత్రాలను సోమవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అలీ షరీఫ్, రావుల శ్రీను, కుంటోళ్ల మహేశ్‌కుమార్‌గౌడ్, రేగొండ రమేశ్, ఏనుగు బాల్‌రెడ్డి, చెరుకు గణేశ్, ఏనుగు జగన్‌రెడ్డి, సుంకరి రమేశ్, రావుల అనిల్ పాల్గొన్నారు.

## సభ విజయవంతం చేసిన శ్రేణులకు ధన్యవాదాలు

● బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు జనగాం పాండు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 28 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు జనగాం పాండు అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరైన సభ బ్రహ్మాండంగా విజయవంతమైందన్నారు. రజతోత్సవ సభకు భువనగిరి మండలం నుంచి దాదాపు 5వేల మంది హాజరయ్యారని చెప్పారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సుబ్బూరు బీరు మల్లయ్య, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నీల ఓం ప్రకాశ్‌గౌడ్, నాయకులు అబ్బగాని వెంకట్, ర్యాకల శ్రీనివాస్, నాగేందర్ బాబు, శ్రీకాంత్, మధు పాల్గొన్నారు.

## సభ విజయవంతానికి కృషి చేసిన శ్రేణులకు కృతజ్ఞతలు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతానికి కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఆ పార్టీ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేశ్ సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన స్ఫూర్తితో పార్టీ క్యాడర్‌లో నూతన ఉత్సాహం వచ్చిందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతామని తెలిపారు.

## రజతోత్సవ సభతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్

రాజాపేట, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ కార్యకర్తల్లో నూతనోత్తేజం తెచ్చిందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజోత్సవ సభ జన ప్రభంజనంతో చరిత్రలో హైలెట్‌గా నిలిచిందన్నారు. సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, నాయకులు గుంటి కృష్ణ, ఎర్రగోకుల జశ్వంత్, కాకాల ఉపేందర్, బెడిద వీరేశం, ఉప్పలయ్య గౌడ్, అంకతి సుదర్శన్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ అంచనా ప్రకారం ఇండ్లు నిర్మించుకోవాలి

● మండల ప్రత్యేకాధికారి గోపాల్



ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి గోపాల్

ఆలేరు రూరల్, ఏప్రిల్ 28 : ప్రభుత్వ అంచనా ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని మండల ప్రత్యేకాధికారి గోపాల్ అన్నారు. మండలంలోని కొలనుపాకలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాల కోసం సోమవారం నిర్వహించిన ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ అంచనా ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటే ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, మండల పంచాయతీ అధికారి అనూరాధ, పంచాయతీరాజ్ ఏఈ నవ్య, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన



ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్‌రావు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 28 : మండలంలోని బండసోమారంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియను మండల ప్రత్యేకాధికారి జినుకుల శ్యాంసుందర్‌రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరవుతాయన్నారు. లబ్ధిదారులకు విడుతల వారీగా ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు. గ్రామంలో మొత్తం 115 ఇండ్లు మంజూరు కాగా, అందులో 68మంది లబ్ధిదారులు ముగ్గు పోసి ఇంటి నిర్మాణ పనులు చేపట్టారన్నారు. 21 ఇండ్ల బేస్‌మెట్ లెవల్ పనులు పూర్తికాగా, 16మందికి లక్ష రూపాయల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు నానం కృష్ణగౌడ్, పంచాయతీ కార్యదర్శి బి.మంజుల పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాల సేకరణ



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 28 : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలను సోమవారం మండల ప్రత్యేకాధికారి రాజారాం తెలుసుకున్నారు. లబ్ధిదారుల ఇండ్ల వద్దకు వెళ్లి వారి ఆర్థిక పరిస్థితులతోపాటు ఇతర వివరాలను సేకరించారు. లబ్ధిదారులకు నాలుగు విడుతల్లో ప్రభుత్వం రూ.5లక్షలు అందజేస్తుందని తెలిపారు. 2నెలల్లోనే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాములునాయక్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్, బిల్ కలెక్టర్ సుదర్శన్ ఉన్నారు.

## గుండెపోటుతో చేనేత కార్మికుడు మృతి

రామన్నపేట, ఏప్రిల్ 28 : మండల కేంద్రంలో గుండెపోటుతో చేనేత కార్మికుడు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని పద్మశాలి కాలనీలో భార్య, ఇద్దరు కూతుళ్లతో కలిసి నివాసముంటున్న పున్న నర్సింహ (47) చేనేత పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం ఇంట్లోనే చేనేత పనిచేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ జెల్ల వెంకటేశం, పద్మశాలి సంఘం నాయకులు భవనరుషి, యాదగిరి, నాగభూషణ్, నాగరాజు, రఘు, అశోక్ తదితరులు నర్సింహ భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

అడ్డగూడూరు, ఏప్రిల్ 28 : మండలంలోని గట్టుసింగారం గ్రామంలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన మద్ది ధనుంజయ్ రోజు మాదిరిగానే బర్రెను మేపడానికి తోలుకెళ్లగా.. మూసీ వాగులో ఉన్న కరెంట్ తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.